

డయేరియా నియంత్రణకు చర్యలు : డీపీవో

కురుపాం, జూన్24: గ్రామాల్లో డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం కురుపాం మండల కార్యాలయంలో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. డయేరియా మాసోత్సవాలలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. రక్షిత నీటి పథకం ట్యాంకులను శుభ్రపరచాలని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సూచించారు. నిరంతరం వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ ఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు!

- పెంచిన పింఛన్ల పంపిణీకి మంత్రి వర్గం ఆమోదం
- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం చంద్రబాబు
- వచ్చేనెల నుంచి ఇంటి వద్దే అందించేందుకు రంగం సిద్ధం
- హర్షం వ్యక్తం చేస్తున్న సామాజిక పింఛన్‌దారులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)



సామాజిక పింఛన్‌దారులకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వచ్చేనెల నుంచి పెంచిన పింఛన్ అందజేయాలని నిర్ణయించింది. సోమ వారం సీఎం చంద్రబాబునాయుడు మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక హామీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచిన పింఛన్ సొమ్మును జూలై ఒకటో తేదీన పింఛన్ దారుల ఇంటి వద్దే అందించనున్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్, మే, జూన్.. మూడు నెలలకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికీ రూ.7వేల పింఛన్ సొమ్ము అందించనున్నారు. దీంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తంగా 1,45,092 మంది సామాజిక పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో అభయహస్తం పింఛన్‌దారులు 4,598 మంది, సైనిక వెల్ఫేర్ లబ్ధిదారులు నలుగురు, సికెడీయూ 136 మంది ఉన్నారు. వారిని మినహాయిస్తే.. మిగిలిన 1,40,354 మంది సామాజిక పింఛన్‌దారులు టీడీపీ కూటమి సర్కారు తాజా నిర్ణయంతో లబ్ధి పొందనున్నారు. ఇకపోతే దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. ఈ మొత్తం వచ్చేనెల నుంచే వారికి కూడా అందించనున్నారు.

పెరిగిన పింఛన్ వీరికే..

జిల్లాలో సామాజిక పింఛనుదారుల్లో వృద్ధులు 79,498 మంది, వేవర్స్ 768 మంది, దివ్యాంగులు 17,034 మంది, వితంతువులు 34,769, తాడి టాపర్స్ 193 మంది ఉన్నారు. థర్డ్‌జెండర్స్ 12 మంది, ఫిషర్‌మెన్ 825 మంది, ఒంటరి మహిళలు 2,363 మంది, ట్రెడిషనల్ కాబ్లర్స్ 1,875 మంది, డప్పు కళాకారులు 1,785 మంది, ఇతర కళాకారులు 134 మంది ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిఫారసులతో పింఛన్ పొందుతున్న 66 మందితో పాటు ఏఆర్‌టీ లబ్ధిదారులు 320 మందికి వచ్చేనెల నుంచి పెంచిన పింఛన్ సొమ్ము అందనుంది. కాగా టీడీపీ కూటమి సర్కారు ప్రతినెలా సామాజిక పింఛన్ల కోసం జిల్లాకు సుమారు రూ.60.294 కోట్ల కేటాయించనుంది. కాగా టీడీపీ కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్ల సొమ్మును ఒకేసారి రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గత వైసీపీ సర్కారు పాలనలో..

గత వైసీపీ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ల పెంపునకు ఐదేళ్ల కాలం పట్టింది. వాయిదాల పద్ధతిలో పెంచు తూ.. నాలుగేళ్లు గడిచిన తర్వాత రూ.3 వేల చొప్పున పింఛన్ అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికే పింఛన్‌దారులకు నెలకు రూ.2వేలు పింఛన్ అందేది. కాగా నాలుగేళ్ల కాలంలో ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ.. చివరిలో రూ.3 వేల చొప్పున అందించింది. ప్రతినెలా పింఛన్ల కోసం రూ.43.975 కోట్లు కేటాయించేవారు.

ప్లీజ్.. విధుల్లోకి తీసుకోండి

- మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్న మాజీ వలంటీర్లు
- వైసీపీ నేతల మాయ మాటలు విని మోసపోయాం
- బలవంతంగా రాజీనామాలు చేయించారని వెల్లడి
- కూటమి శ్రేణులు, అధికారులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/ గరుగుబిల్లి)

జిల్లాలో మాజీ వలంటీర్ల పరిస్థితి అమగ్యగోచరంగా మారింది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతల మాటలు విని.. రాజీనామాలు చేసిన వారు ఇప్పుడు పడరాని పాట్లు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ..తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు అధికారులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాస్తవంగా గత వైసీపీ సర్కారు జిల్లాలో 5,680 మంది వలంటీర్లను నియమించింది. అయితే వీరిలో సుమారు 2,686 మంది ఎన్నికల సమయంలో రాజీనామాలు చేయలేదు. ప్రస్తుతం వీరికి నెలవారీ గౌరవ వేతనాన్ని సంబంధిత సచివాలయ కార్యదర్శులు మంజూరు చేస్తున్నారు. కాగా గతంలో రాజీనామాలు చేసిన వలంటీర్లు ప్రస్తుతం తలలు పట్టుకుంటున్నారు. గ్రామస్థాయిలోని వైసీపీ ప్రతినిధులను నిలదీస్తున్నారు. మరోవైపు గ్రామ, మండల స్థాయి ప్రతినిధులతో పాటు కూటమి ఎమ్మెల్యేల వద్దకు చేరి తమ గోడును చెప్పుకుంటున్నారు. అదేవిధంగా మండల కేంద్రాల్లోని ఎంపీడీవోలను కలిసి తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని ప్రాధేయపడుతున్నారు. అయితే తామేమీ చేయలేమని వారు చెతులెత్తేస్తున్నారు. దీంతో మాజీ వలంటీర్లకు ఏం చేయాలో తోచడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం టీడీపీ కూటమి ప్రభుత్వం వలంటీర్ల జీతం పెంచనున్నారనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో మాజీలు మరింత ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు వైసీపీ నేతలు, ఐప్యాక్ బృందం మాటలు విని మోసపోయామని కొందరు కన్నీరుమున్నీరవుతున్నారు. తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని మరికొందరు వాపోతున్నారు.

గతంలో వైసీపీ కార్యకర్తల్లా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేకమంది వలంటీర్లు ఆ పార్టీకి కార్యకర్తల్లా పనిచేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల తరఫున ప్రచారాల్లో పాల్గొన్నారు. వారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీకి ఓటు వేయకుంటే పథకాలు ఆగిపోతాయని లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి బెదిరించారు. ఇటువంటి వలంటీర్లు ఎన్నికల ముందు రాజీనామాలు చేయగా.. మళ్లీ వారిని ఎలా నియమించగలమని కూటమి శ్రేణులు భావిస్తున్నాయి. వైసీపీ కోసం ఇంతకాలం పనిచేసిన వారు ఇప్పటికిప్పుడు మారుతారా? అన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. కాగా ఎన్నికల సమయంలో కూటమి గెలుపునకే కృషి చేశామని, తిరిగి తమను నిమమించాలని మరికొందరు మాజీ వలంటీర్లు అధికార పార్టీ నేతలను కోరుతున్నారు. మరోవైపు గ్రామస్థాయి నాయకులు సిఫారసుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌తో పాటు పలువురిని మాజీ వలంటీర్లు కలిశారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అయితే వలంటీర్ల నియామకానికి సంబంధించి టీడీపీ కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. కాగా మాజీ వలంటీర్ల నియామకంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందిస్తున్న మాజీ వలంటీర్లు (ఫైల్)

‘నోటీసులు జారీ చేస్తాం’

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయానికి సంబంధించి నోటీసులు జారీ చేస్తామని పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి పీకే రావు తెలిపారు. ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ఆ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం వివరాలు సేకరించామని చెప్పారు. నోటీసులను జారీ చేసేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించామని వెల్లడించారు. ఏదేమైనా వైసీపీ కార్యాలయ భవనం విషయంలో అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

విదేశీ అతిథులు వచ్చేశాయ్

- చెల్లంనాయుడువలసలో సైబీరియా పక్షుల సందడి
- తరలివస్తున్న సందర్శకులు



సీతానగరం, జూన్ 24: సీతానగరం మండలం చెల్లంనాయుడువలస గ్రామం పరిసరాలకు సైబీరియా పక్షులు చేరుకున్నాయి. ఇక్కడి సువర్ణముఖి నదీ సమీపంలో ఉండే వందలాది చెట్లను ఆవాసంగా చేసుకుని సందడి చేస్తున్నాయి. ఈ విదేశీ విహంగాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఏటా జూన్ రెండో వారంలో ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ పక్షులు దాదాపు ఆరు నెలల పాటు ఇక్కడే ఉంటాయి. ఇప్పటికే నదితో పాటు, పరిసర పొలాల్లో అవి సంచరిస్తూ.. అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఇలా తరలివస్తున్న విదేశీ పక్షులకు ఈ గ్రామస్థులతో ప్రత్యేక అనుబంధం ఉంది. అవి వస్తే తమ ప్రాంతానికి మంచి జరుగుతుందని, పంట దిగుబడులు బాగా వస్తాయని గ్రామస్థుల నమ్మకం. కొందరు వాటిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుంటారు. కాగా వాటిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు తరలివస్తున్నారు. అయితే ఈ ప్రాంతాన్ని వలస పక్షుల అవాస కేంద్రంగా మార్చి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఏళ్ల నుంచి స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతలు హామీలిచ్చినా అమలు కాలేదు. అటవీ, పశు సంవర్ధకం, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు సందర్శించినా కార్యరూపం దాల్చలేదు. పక్షులకు అవాసం, స్టాండ్ల ఏర్పాటు, పిల్లల సంరక్షణ, వాటికి ఆహారం తదితర పనులు చేపట్టాల్సి ఉంది. కాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. విదేశీ పక్షులుండే తమ గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని మాజీ సర్పంచ్ పారినాయుడు, ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

దృష్టి సారిస్తాం..

‘ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించాం. అయితే పర్యాటకాన్ని వ్యతిరేకిస్తూ కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అడ్డంకులు తొలిగిన తర్వాత ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారిస్తాం’ అని డీఎఫ్‌వో సత్యనారాయణ తెలిపారు.

అన్యాయం చేశారు... ఆదుకోండి!

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల వినతి
- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- ఎన్నికల అనంతరం తొలిసారిగా నిర్వహణ
- అధికారులకు తమ గోడును వినిపించిన జిల్లావాసులు

పార్వతీపురం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ అనంతరం పార్వతీపురం కలెక్టరేట్‌తో సీతంపేట ఐటీడీఏ తదితర కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనేక మంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కలెక్టరేట్ కూడా అర్జీదారులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించారు. తమకు అన్యాయం చేశారు.. ఆదుకోవాలని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల గెస్ట్ టీచర్లు కోరారు. ఈ మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకంతో తాము ఉపాధి కోల్పోయామని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తమను తొలగించడం దారుణమన్నారు. తక్షణమే తమను ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు కూడా వారు వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలోనే జిల్లాలోని ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల వివరాలు అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని వారు తెలిపారు.



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్, జేసీ తదితరులు

చేయూత నగదు జమకాలే..

గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా బటన్ నొక్కినా.. ఇంతవరకు తమ బ్యాంకు ఖాతాల్లో చేయూత పథకం నగదు జమ కాలేదని గరుగుబిల్లి మండలం రావుపల్లికి చెందిన మహిళలు వాపోయారు. కొంతమందికి మాత్రమే నగదు పడిందని, సంక్షేమ పథకాల మంజూరులో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేయూత నిధులు ఇప్పించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పాతవారికే అవకాశం ఇవ్వాలి..

పార్వతీపురం రూరల్: గతంలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసిన వారికే అవకాశం ఇవ్వాలని ఏఎన్‌ఎంలు కోరారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, సురేష్ తదితరుల ఆధ్వర్యంలో వారు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో విస్తృతంగా సేవలు అందించామని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమను తొలగించారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఏఎన్‌ఎంలు కోరారు.

ప్రతి సమస్యా పరిష్కారం కావాలి: కలెక్టర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించాలని, ప్రతి సమస్యనూ పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పారదర్శకంగా పని చేయాలన్నారు. రక్షిత నీటి పథకం ట్యాంకులను శుభ్రపర్చాలని, ప్రజలకు సురక్షిత నీటిని అందించాలని సూచించారు. కలుషిత నీటి కారణంగా ప్రజలు అనారోగ్యం పాలైతే.. మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ చేతులు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలన్నారు. కాగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 124 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, జేసీ శోభిక తదితరులు పాల్గొన్నారు.



న్యాయం చేయాలని కోరుతున్న ఏకలవ్య పాఠశాలల గెస్ట్ టీచర్లు



చేయూత నగదు జమ కాలేదంటున్న రావుపల్లి మహిళలు



పింఛన్ ఇప్పించండయ్యా..

సీతంపేట: తన కుమారుడికి దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని చాకలిగూడ గ్రామానికి చెందిన సవర సరోజని అధికారులను వేడుకుంది. సోమవారం కుమారుడితో కలిసి ఆమె సీతంపేట ఐటీడీఏకు వచ్చింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చింది. తన కుమారుడిని దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని ఎన్నోసార్లు వేడుకున్నా.. గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. వైకల్యంతో జన్మించిన తన కుమారుడుకు ప్రస్తుతం ఆరేళ్లు అని.. పింఛను లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపింది. కుటుంబ పోషణ భారంగా మారిందని, కుమారుడిని ఇంటిలో వదిలి పనిలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయింది. తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది. చలించిపోయిన గురుకుల సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు చార్జీల నిమిత్తం ఆమెకు రూ.వంద అందించారు. కాగా సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు వచ్చినట్టు ఏపీవో ఎస్.వెంకట్‌గణేష్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తదితరులు పాల్గొన్నారు.

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి
DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

❍ **చివరి తేదీ:** జూలై 9

❍ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయి ల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/yknNzixలో
చదవండి.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లోకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్టులో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల



క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జూలై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/2czlCy9
లో చదవండి.

'జనజాతర'ను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవించిన గడ్డపై వచ్చే నెల 7 న జనజాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్రకో కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురగాల లక్ష్మణరావు మాదిగ, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి గర్బాపు రమేష్ మాదిగ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. జనజాతరలో మాదిగసోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు పిల్లి శంకరరావు, అరసాడ బాల రాజు, శ్రీను, చిట్టి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి, ఎల్.కోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన 1998-99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గంగుబూడి పాఠశాలకు 25 వేలు విలువచేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. వీరంతా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమయ్యే మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.సూర్యనారాయణ, ఎస్‌వి.రామారావు, సూరిదేముడు, ఎం.రామారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు ఐదు వినతులు

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు ఐదు వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలు వెల్లడిస్తూ వినతిపత్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడుకు అందజేశారు. ఆయా వినతుల పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. హౌసింగునకు సంబంధించి 1, ఇంజనీరింగు విభాగానికి సంబంధించి 2, పారిశుధ్య విభాగానికి సంబంధించి 2, వలంటీర్ల రాజీనామాకు సంబంధించి రెండు వినతులు అందాయి. ఏసీపీ అమ్మాజీరావు, ఈఈ శ్రీనివాసరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యంగా ప్రజా విజయం పార్టీ ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ వ్యవస్థాపకులు పి షణ్ముఖరావు అన్నారు. సోమవారం ప్రజా గ్రంథాలయంలో ప్రజా విజయం పార్టీ ఏర్పాటు, పార్టీ విధి విధానాలను ప్రకటించారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ పార్టీ ప్రధాన ఏజెండా అన్నారు. ప్రతినిధులు బంగారాజు, మన్మథరావు, సాంబమూర్తి, దుర్గారావు పాల్గొన్నారు.

'మట్టి నమూనాలు పరీక్షిస్తున్నాం'

బొబ్బిలి: బొబ్బిలి మండలంలో 1080 మట్టి నమూనాలను సేకరించి నేల ఆరోగ్యాన్ని పరీక్షించనున్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు. బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామంలో సోమవారం మట్టినమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ సహాయకుల ద్వారా ప్రతి ఆర్‌బీకే పరిధిలో 50 చొప్పున మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపనున్నట్లు తెలిపారు. మట్టి ఆరోగ్యాన్ని, లక్షణాలను విశ్లేషించి ఆ ఫలితాల రిపోర్టును ఆయా రైతులకు అందజేస్తామన్నారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా రైతులు సాగు చేసే పంటలకు ఎటువంటి ఎరువులు వినియోగించాలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు రాయితీలు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో పదవ తరగతి వరకూ, ఇంటర్ కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించాలని ఎపీడబ్ల్యూజె నాయకులు కోరారు. సోమవారం కలెక్టరు నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ విద్యాశాఖాధికారికి లేఖను పంపించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు గడువు జూలై 15

రాజాం రూరల్: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (మద్రాస్) వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులు జులై 15 లోగా ఫీజు చెల్లించాలని హిందీ ప్రచారక్ కొండవలస మధుసూధనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు సెప్టెంబరులో పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు. వివరాలకు 99499 17365 నెంబరుకు సంప్రదించాలని సూచించా రు.

గోల్డ్‌స్టార్-కల్లేపల్లి మార్గంలో
దొంగల భయం

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ కూడలి నుంచి కల్లేపల్లి వెళ్లే మార్గంలో ప్రయాణించేందుకు ప్రజ లు భయపడుతున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలే దీనికి తార్కాణం. రాత్రిపూట ఒంటరిగా ప్రయాణి స్తున్న వారిపై దొంగలు పడి దోచుకోవడంతో పాటుగా తీవ్రంగా గాయపరుస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మా ర్గంలో మామహామాయ, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా అనే రెండు ప్రధాన కంపెనీలు ఉన్నాయి. వీటిలో పనిచే స్తున్న వందలాది మంది కార్మికులు షిఫ్టుల వారీగా విధులు ముగించుకొని రావడానికి భయపడుతున్నారు. వారం రోజుల కిందట స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియాలో పని చేసి తిరిగి వస్తున్న ఒక వ్యక్తిపై రాత్రిపూట గుర్తు తెలి యని వ్యక్తులు దాడిచేసి సెల్‌ఫోను, బైక్, కొంత సొమ్ము లాక్కొని తీవ్రంగా గాయపరిచారు. ఈ మధ్యకాలంలో రైతుల వాటర్ ఇంజన్లు, మోటార్లు, కోళ్లు, పశువులు మోటార్ బైక్‌లు వరుసగా మా యమై పోతున్నాయి. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు దృష్టి పెట్టి.. ఈ మార్గంలో దొంగతనాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అతిసార నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

● పదిశాఖల సమన్వయంతో వ్యాధి కట్టడికి చర్యలు ● జేసీ కార్తీక్


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలోని అతిసార వ్యాధి వ్యాప్తిని నిరోధించేందుకు పది ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో ఒక టాస్క్ పోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జేసీ కార్తీక్ చెప్పారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలలు పాటు ఈ వ్యాధిని నియంత్రించేందుకు టాస్క్ పోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో అతిసార నియంత్రణ టాస్క్ పోర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ మాట్లాడుతూ ఐదేళ్ళ లోపు పిల్లలు ఎవ్వరూ ఈ వ్యాధి బారిన పడి మరణించకుండా ఇంటింటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ప్యాకెట్లు పంపిణీ, తాగునీరు వనరులు కలుషితం కాకుండా , వాటిని తరచుగా క్లోరినేషన్ చేయడం, పరిసరాలు పరిశుభ్రత చర్యలు చేపట్టడం వంటి చర్యల ద్వారా వచ్చే రెండు నెలలు కాలంలో అతిసార మరణాలు లేకుండా చూడాలని చెప్పారు. జిల్లా వైద్యాధికారి భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలోని 1.34 లక్షల మంది ఐదేళ్ల లోపు వయస్సు గల చిన్నారులు ఉన్నట్లు చెప్పారు. ఈ చిన్న పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి రెండు ఐఆర్ఎస్ ప్యాకెట్లు , 14 జింక్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులపై దాడులు చేస్తే చర్యలు

● గ్రీవెన్స్‌లో ఎస్పీ దీపిక పాటిల్


ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, జూన్ 24: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో విభిన్న ప్రతిభావంతులను హేళన చేసినా, దాడులకు పాల్పడినా విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపికా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 39 ఫిర్యాదులు స్వీకరించారు. ● గుర్ల మండలం గూడేం గ్రామానికి చెందిన మహిళ ఎస్పీ దీపికాకు ఫిర్యాదు చేస్తూ, అదే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు పాత కక్షలతో తనను హేళన చేసి, కొట్టారని న్యాయం చేయాలని కోరారు.
● విజయనగరం పట్టణానికి చెందిన మహిళ ఎస్పీ దీపికాకు ఫిర్యాదు చేస్తూ, తన భర్త తాగుడికి అలవాటు పడి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని అదనపు కట్నం తెమ్మని డిమాండ్ చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు. ● చీపురుపల్లి మండలం గుడిదాం గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్పీ దీపికకు ఫిర్యాదు చేస్తూ, ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలను తన గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ తక్షణమే చర్యలు తీసుకుని ఏడు రోజుల్లో తమకు నివేదిక అందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఆష్మాపరహీన్, డీఎస్పీలు గోవిందరావు, విశ్వనాథ్, వీర కుమార్, సీఐ మురళీ, ఎస్ఐ గణేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు అందరికీ అందేటట్లు చూడాలి


విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట, జూన్ 24: నియోజకవర్గంలోని రైతులందరికీ ఖరీఫ్ విత్తనాలు అందేలా చూడాలని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసా య కార్యాలయం వద్ద ఏవో ఎం.స్వాతి ఆధ్వర్యంలో విత్తన పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లలితకుమారి మా ట్లాడుతూ రైతులకు ఎటువంటి ఆటంకం లేకుండా రాయితీపై విత్తనాలు అంద జేయాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రైతుల కోసం నిరంతరం తపిస్తున్నారని పేర్కొన్నారు. విత్తనాలు సరిపడా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని కొత్తవలస వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ ఎల్.విజయ తెలిపారు. మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ, గుమ్మిడి ప్రసాద్, భూపాల్‌నాయుడు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞమాతకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి, జూన్ 24: యజ్ఞమాత జగదాంబ సరస్వతి పుణ్యదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఓం శాంతి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. మాత చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం అనేక ఒత్తిడిలతో నిండిన జీవితాలను గడుపుతున్న అనేకమందికి బ్రహ్మకుమారీస్ సంస్థ వారు ప్రశాంతతను ప్రసాదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీకే రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై విచారణ చేపట్టాలి


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న కంచరాం గ్రామస్థులు

రాజాం: కంచరాంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు మీసాల సత్యంనాయుడు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఎస్.అప్పారావు, ఆర్.బాషా, ఆర్.అప్పలనాయుడు, ఎస్.సంగంనాయుడు, టంకాల వైకుంఠరావు ఎస్.హరీష్‌నాయుడు, పి.గణేష్, ఆర్.ప్రదీప్‌కుమార్ తదితరులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పనులకు వెళ్లని వారికి కూడా మస్తర్లు వేశారని... దీని వల్ల రోజువారీ కూలికి వెళ్లిన వారికి తక్కువ వేతనం వచ్చేదని తెలిపారు. మేట్లకు నచ్చిన వారికి పనికి రాకపోయినా హాజరు వేసి.. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సర్పంచ్ సమక్షంలో మేట్లతో కుమ్మక్కై ఈ అక్రమాలు చేశారని ఆరోపించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే సమక్షంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు నిధులను వెనక్కి రాబ డతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో రేణుకాసాయి, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు 29న ప్రవేశపరీక్ష

రేగిడి: ఉంగరాడమెట్ట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9 తరగతుల్లో మిగులు సీట్లకు ఈ నెల 29న స్థానిక పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి. సూర్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వెల్లడించారు.

ఎమ్మెల్యే అదితికి శుభాకాంక్షలు


అదితికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజుని సోమవారం జిల్లా ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (పీఎంపీ) ప్రతినిధులు అభినం దించారు. పేరి రామయ్య పంతులు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు టీడీపీ కార్యాలయంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అసోసియేషన్ నాయకులు కేఎస్ఎన్ మూర్తి, చంద్రశేఖర్ పట్నాయక్, ఈశ్వరరావు, అప్పలరాజు, ఆర్.ప్రసాద్, రాముడు, జెస్సికా గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు

కలెక్టరేట్: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఆర్టీజీల శాఖల మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు ఏపీ సచివాలయంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు.

మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీనివాస్


కాలువల్లో పూడికలు తొలగించండి

● రైతు సంఘ నాయకుల డిమాండ్

కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో గల కాలువల్లో ఉన్న పూడికలను వెంటనే తొలగించాలని ఏపీ రైతు సంఘ నాయకులు బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తోటపల్లి, వెంగళరాయ, తాటిపూడి, పెద్దగెడ్డ, ఆండ్ర తదితర నీటి వనరుల పరిధిలో ఉన్న కాలువల్లో పూడిక చాలా ఎక్కువగా ఉందని దీనిని వెంటనే తొలగించాలని కోరారు. జంగిల్ షట్టర్లు, గండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు . నీటి పారుదల సిబ్బంది, లష్కర్లను నియమించి నీటి పంపిణీ సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ నాయకులు గోపాలం, శంకరరావు, రాయవరపు సత్యం, లోకవరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి


ముకుందపురం పాఠశాల పరిశీలనలో ఎంఈవో జగదీశ్వరరావు

వేపాడ: పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల విద్యాశాఖాధికారులు జగదీశ్వరరావు, బాలభాస్కరావు అన్నారు. జగదీశ్వరరావు సోంపురం, ముకుందపురం పాఠశాలలను పరిశీలించగా, బాలభాస్కరరావు ఆకులసీతంపేట పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


సత్కరిస్తున్న స్నేహసంస్థ ప్రతినిధులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 24: వెంకటరమణపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఎస్.కోట స్నేహ స్వచ్ఛంద సంస్థ సోమవారం నగదు బహుమతులు అందించి, సత్కరించింది. సంస్థ ప్రతినిధులు అట్లూరి శ్రీవెంకటరావు, ఎల్ఐసీ సుబ్బారావు, ప్రకాష్‌లు గ్రామపెద్ద సాదు చేతుల మీదుగా విద్యార్థి షైచర్ల దిలీప్ కుమార్, ఆమె తల్లిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

గంట్యాడ, జూన్ 24: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వసాది గ్రామానికి చెందిన బొదంకి ఎర్నినాయుడు(47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో ఉన్న పొలానికి వెళ్లాడు. అక్కడ పొలం పనులు చేస్తుండగా ఒక్కసారి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతోపాటు పిడుగులు పడ్డాయి. ఎర్నినాయుడుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై మృతుడి కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామిలో ఆవు..

జామి: పిడుగుపాటుకు పాడిఆవు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన కృష్ణమ్మ ఎప్పటిలాగే కళ్లంలో ఆవు కట్టి ఉంచింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా పిడుగుపడడంతో ఆవు మృతి చెందింది. జీవనాధారం అయిన ఆవు చనిపోవడంతో తమకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

పాముకాటుతో రైతు..


వెంకటరమణ (ఫైల్)

జామి, జూన్ 24: మండల కేంద్రమైన జామి నెయ్యిల వీధికి చెందిన ఎర్ని వెంకటరమణ(48) పొలంలో పనిచే స్తుండగా పాముకాటుకు గురై మరణించాడు. దీనికి సంబం ధించి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సో మవారం ఉదయం మొక్కలకు పురుగుల మందు కొట్టడానికి వెంకటరమణ పొలా నికి వెళ్లాడు. అక్కడ పురుగుల మందు కొడుతుండగా పాము కాటు వేసింది. గుర్తించిన స్థానికులు వెంటనే పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

రాజాం రూరల్, జూన్ 24: మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన వంజరాపు సన్యాసినాయుడు(74) గడ్డిమందు తాగి సోమవారం మృతి చెందాడు. ఏఎస్ఐ లక్ష్మనాయుడు అందించిన సమాచారం ప్రకారం సారధి గ్రామానికి చెందిన సన్యాసినాయుడు మతిస్థిమితం లేక, రాత్రివేళ నిద్రపట్టక తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 23న రాత్రి 11 గంటల సమయంలో వ్యవసాయానికి ఉపయోగించే గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజాంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న వనజాక్షి

విజయనగరం రూరల్, జూన్ 24: రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనకు సంబంధించి హోం మంత్రి అనిత, జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించిన తీరు ప్రశంసనీయమని జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి కొనియాడారు. ఆమె నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇది దారుణమైన ఘటన అని, దీనిని ఖండిస్తున్నామన్నారు. హోంమంత్రి, పోలీసు యంత్రాంగం 36 గంటల్లో కేసు చేధించి, మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల అదుపులో ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించండి


మాట్లాడుతున్న కార్యనిర్వాహక అధికారి కన్నబాబు

శృంగవరపుకోట, జూన్ 24: శృంగవరపుకోట గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని వార్డుసభ్యుడు కాపుగంటి శ్రీని వాసరావు(వాసు) కోరారు. సోమవారం పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. వార్డుల్లో సమస్యలుంటే ప్రస్తావించాలని స ర్పంచ్ గనివాడ సంతోషి కుమారి పేర్కొన్నారు. సీతంపేట వార్డు సభ్యురాలు చింత ల సత్యవతి తాగునీటి సమస్య తీర్చాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల్లో పారి శుధ్య నిర్వహణ, పాడైన కాలువలను బాగుచేయాలని, తాగునీటి సరఫరా వంటి విషయాలను పలువురు సభ్యులు ప్రస్తావించారు. ఇంటి పన్ను వసూలు, మార్చి 27 నుంచి జూన్ 23 వరకు జనన, మరణాలపై సమీక్ష, 15వ ఆర్థిక సంఘ నిధుల ఖర్చు, నూతన నిర్మాణాలకు ప్లాన్‌లు వంటి వాటి గురించి చర్చించారు. కార్యనిర్వా హక అధికారి సీహెచ్ కన్నబాబు, ఉప సర్పంచ్ మోపాడ కుమార్ ఉన్నారు.

ఈ బోర్డులు మార్చరా?



జామి ఎంఈవో కార్యాలయంలో సమాచారహక్కు బోర్డులో పాత విద్యాశాఖాధికారి పేరు ఉన్న దృశ్యం

జామి: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి కార్యాలయంలోనూ చిత్త శుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని ప్రభుత్వ శాఖలు దీనిని విస్మరిస్తున్నాయి. మండల విద్యాశాఖ ఈ కోవలోకే వస్తోంది. ఈ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించి కొందరు అధికారుల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డుల్లో ఉన్న అధికారులు బదిలీపై వెళ్లి నెలలు గడు స్తున్నా అధికారులు వీటిని మార్చడం లేదు. మండల కేంద్రంలో ఉన్న ఏంఈవో కార్యాలయ ఆవరణ లోని బోర్డులో జిల్లా విద్యాశాఖాదికారి లింగేశ్వరరెడ్డి అని ఉంది. ఆయన ఈ ఏడాది ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రేమ్‌కుమార్ వచ్చారు. అయినా ఈ బోర్డుల్లో పేర్లు మార్చకపోవడం గమనార్హం.

బేబీనాయన పుట్టినరోజు వేడుకలు

బొబ్బిలి, జూన్ 24: బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) జన్మదిన వేడుకలు సోమవారం బొబ్బిలి కోటలో ఘనంగా జరిగాయి. బేబీనాయన తన సోదరులు, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, రామకృష్ణరంగా రావు ఇతర కుటుంబసభ్యులతో సహా తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి మొక్కులు సమర్పించుకునేందుకు వెళ్లారు. ఆయన పరోక్షంలోనే బేబీనాయన జన్మదిన వేడుకలు స్థానికంగా నిర్వహించారు. అంజనీఫౌండేషన్ అధినేత పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌ను మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు కట్ చేసి అందరికీ తినిపించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, అవేర్ ఫౌండేషన్, రోటరీక్లబ్ ప్రతినిధులు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), గెంబలి శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తెంటు ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బేబీనాయన బర్త్‌డే సందర్భంగా కోట ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు రౌతు రామ్మూర్తి, కింతలి బంగార్రాజు, తెలుగు మహిళానేతలు కింతలి శ్రీదేవి, వెలగాడ హైమావతి, గొల్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కాకల వెంకటరావు, కౌన్సిలరు గోవిందమ్మ, గజరాయునివలస ఎంపీటీసీ పాలవలస గౌరు, ఆర్యవైశ్యసంఘం నేత అడ్డా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: బొబ్బిలి శాసన సభ్యులు బేబీనాయన జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి చాలా గ్రామాల్లో కేక్‌కూడా కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆరికతోట గ్రామంలో తెలుగుదేశం నాయకులు భారీ ఎత్తున కేక్ ఏర్పాటు చేసి కట్ చేశారు. టీడీపీ నాయకులు పల్లా చంద్రరావు, కూనిశెట్టి భాస్కరరావు, బేత సోమినాయుడు, సంగిరెడ్డి ప్రసాదరావు, రెడ్డి అప్పల రాం, పూసర్ల వెంకటరాజు(బోసు), తూముల అప్పన్న, పొందూరు కాంతా రావు, వర్రి సన్యాసప్పడు, పెంకి రాము తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే బేబీనాయన పుట్టినరోజు వేడుకలు ఎరుకుల పాకలు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, సర్పంచ్ పాలవలస పార్వతి ఎరుకులపాకలు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బాడంగిలోని తెంటు బంగ్లాలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవిబాబు, కార్యదర్శి ఎల్.సత్యం, వైస్ ఎంపీపీ భాస్కరరావు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, బాడంగి ఎంపీటీసీ దేవరపల్లి శ్రీనివాసరావు, కండి భాస్కరరావుతో తెంటు చిరంజీవిరావు, అంబటి గణపతి, గుణుపూరు శ్రీను, మరడాన గాంధీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాం: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన జన్మదిన వేడుకలను కురుపాంలో టీడీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, పార్టీ నాయకులు చందక రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బొబ్బిలి కోటలో అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెంటు

ప్రభుత్వ భూముల ఆక్రమణ


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

బొబ్బిలి: ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని మోటార్లు బిగించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ గిరిజనులు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాడంగి మండలం పినపెంకి పంచాయితీ గదబవలస గ్రామానికి చెందిన గిరిజనులు సీపీఎం నాయకుడు ఎ.సురేష్ నాయకత్వంలో ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటిక లేకపోవడంతో తమ గ్రామంలో అంత్యక్రియల సమయాల్లో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమి ఉందని, కొంత మంది దానిని ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూమిని తమ శ్మశానవాటిక అవసరాలకు, రహదారి కోసం కేటాయించాలని వారు కోరారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● తోలుగూడ గ్రామస్థుల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న తోలుగూడ మహిళలు

పార్వతీపురం రూరల్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కురుపాం మండలం తోలుగూడ గ్రామానికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. తమ గ్రామంలో బోరుబావిని ఏర్పాటు చేయాలని కోరినా గత ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్య పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. అదేవిధంగా కాకలి సెంటర్ నుంచి లిక్కిడి సెంటర్ వరకు రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగునాయుడు, సన్యాసి, కొల్లి సాంబమూర్తి తదితరులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సేవలందించాలి



ఎంపీపీ సురేష్‌కు సమస్యలు వివరిస్తున్న హెచ్‌వీ లక్ష్మీకాంతమ్మ

జియ్యమ్మవలస: ఇక నుంచి గ్రామాల్లో ప్రజలతో మమేకమై వైద్య సేవలందించాలని ఎంపీపీ బొంగు సురేష్ అన్నారు. సోమవారం జియ్యమ్మవలస పీహెచ్‌సీ ఆవరణలో ఆయన వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఏ గ్రామంలోనైనా వైద్యశిబిరం నిర్వహిస్తే సంబంధిత పంచాయతీ ప్రజాప్రతినిధికి తెలియజేయాలన్నారు. ఆసుపత్రిలో ఇబ్బందులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను హెచ్‌వీ లక్ష్మీకాంతమ్మ.. ఎంపీపీ సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీపీ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేస్తే ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ద్వారా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, సీహెచ్‌వో హైమావతి, ఫార్మసిస్టు దిలీప్, డంగభద్ర, బీజే పురం పంచాయతీ సర్పంచ్‌లు జోగి భుజంగరావు, మండల రమాశంకర్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి వనరులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి పైపులైన్లు వెళ్లే మార్గాలు పరిశీలించాలని, మురుగు కాలువలు వంటివి ఉంటే వెంటనే వాటిని సరిచేయాలన్నారు. పైపులైన్లు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే సంబంధిత శాఖాధికారులు వాటిని మార్చాలని, వాటర్ ట్యాంకులు శుభ్ర పర్చాలని ఆయన ఆదేశించారు. డయేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు సూచించాలన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కొనేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలోనూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య కిట్లు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పీడీ, డీఆర్‌డీఏ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విస్సీ ప్రవల్లిక, ఏపీఎం బి.శివున్నాయుడు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణపై అవగాహన

సీతంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గీతాంజలి సోమవారం డయేరియా నియంత్రణపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో జరుగుతున్న అపారిశుధ్య, క్లోరినేషన్ కార్యక్రమాల్లో ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త తప్పనిసరిగా పాల్గొని ప్రజల్లో మలేరియా, డెంగ్యూ, డయేరియా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రపరిచి మురుగునీరు నిల్వ లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి, పీహెచ్‌సీ మెడికల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'తో విద్యార్థుల్లో చైతన్యం



బడికి పోదాం కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం విద్యార్థుల్లో మంచి చైతన్యం కలిగించిందని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి పాలక నారాయుడు తెలిపారు. సోమవారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులతో నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవులు, ఎంఈవో సూర్యచంద్రరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంలు టి.చంద్రరావు, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కిషోర్‌కుమార్

భామిని: సీజనల్ వ్యాధులు సోకుతుండడంతో గ్రామాల్లో వైద్య సేవలు మెరుగు పర్చాలని ఎంపీడీవో కె.కిషోర్‌కుమార్ సిబ్బందిని సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, రన్నింగ్ వాటర్‌లో క్లోరినేషన్ చేయించాలని, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం సరఫరాపై దృష్టి సారించాలని, నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సోయల్, దామోదరరావు, శివకుమార్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లుగా కొనసాగించండి

జామి: మండలంలో తిరిగి తమను కొనసాగించాలని కోరుతూ గత ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లు సోమవారం ఎంపీడీవో తిరుమలరావుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసేలా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల ముందే మురుగు

● వీధి కాలువలు లేని నందకత్తుల గైసీల గ్రామం

● రహదారిపైకి వాడుకనీరు ● అవస్థలు పడుతున్న గ్రామస్థులు

● పట్టించుకోని అధికారులు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధి నందకత్తుల గైసీల గ్రామంలో వీధి కాలువలు లేక మురుగునీరు ఇళ్ల ముందే ప్రవహిస్తోంది. వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో నిల్వ ఉండే మురుగు కారణంగా దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో స్వచ్ఛ జల మిషన్ పథకం కింద ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే కొళాయిల నుంచి ఇంకా తాగునీరు సరఫరా చేయడం లేదు. ఒకవేళ సరఫరా మొదలైతే అక్కడ నీరు పట్టుకునే సమయంలో వృథాగా పోయే నీరు బయటకు పోయేందుకు మార్గం లేక రోడ్డుపైనే ప్రవహించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇప్పటికే ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వెంటనే అధికారులు స్పందించిన మురుగు కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నందకత్తుల గైసీల గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు

హామీల అమల్లో ముందంజ

● మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న మహానాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి, రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తున్నారని అన్నారు. ఇందులో 2వేల ఉపాధ్యాయ పోస్టులు ఎస్టీలకు లభించే అవకాశం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం 6,100 టీచర్ పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చిందని, ఇది కూడా ఎన్నికలకు ముందు ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం పదవీ బాధ్యతలు చేపట్టిన రోజే తన తొలి సంతకాన్ని మెగా డీఎస్సీపై చేశారన్నారు. సోమవారం మంత్రి మండలిలో దానిని ఆమోదించడం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముందుందని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేశారన్నారు. సామాజిక పింఛన్లకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు వేల రూపాయలు పింఛను అందిస్తున్న లబ్ధిదారులకు రూ.4 వేలు పెంచామన్నారు. నాలుగు వేలకు పెంచిన పింఛన్‌ను ఏప్రిల్, మే, జూన్ నెలలు కలిపి వచ్చే నెల ఒకటో తేదీన రూ.7వేలు ఆ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులతో ఇంటి వద్దకు అందిస్తామని, దీనికి మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. దివ్యాంగులు ఇస్తున్న రూ.3వేలు పింఛన్ రూ.6 వేలకు, క్షయవ్యాధిగ్రస్తులకు ఇస్తున్న రూ.5వేలు పింఛను రూ.15 వేలకు, కిడ్నీ, లివర్ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న రూ.5వేలు పింఛన్‌ను రూ.10వేలు పెంచారని వివరించారు. అన్న క్యాంటీన్ పునఃప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

మంత్రి వర్గ ఉప సంఘంలో సంధ్యారాణికి స్థానం

వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా ఉండడంతో దీనిని నివారించేందుకు ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఐదుగురు సభ్యులతోగల కేబినెట్ సబ్ కమిటీలో రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, సంధ్యారాణి, సత్యకుమార్ తదితరులు ఉన్నారు. ఈ ఉపసంఘంలో జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి సంధ్యారాణికి స్థానం కల్పించడం హర్షణీయం.

లోకేశ్‌కు శుభాకాంక్షలు

సాలూరు: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తన చాంబర్‌లో మొదటి సంతకం చేసిన సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం నేరుగా వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట రాష్ట్ర హోంమంత్రి అనిత ఉన్నారు.



లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంధ్యారాణి, అనిత

వర్షంతో హర్షం



మక్కువలో వర్షం కురుస్తున్న దృశ్యం,



కొమరాడలో..

మక్కువ: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉన్న వర్షం కురవకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున వర్షంతో పంట పొలాలు తడుస్తాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ● **కొమరాడ:** మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఎదలు వేశారు. దీనికి తోడుగా వాణిజ్య పంట పత్తి నాటేందుకు కొంతమంది సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని సోమవారం సా యంత్రం వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండల వేడికి ప్రజలు అల్లాడి పోయారు. వర్షం పడడంతో ప్రజలు కొంత ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాచిపెంట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో బి.అనంతలక్ష్మి తెలిపారు. సోమవారం పణుకువలస అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనం ముందు తప్పనిసరిగా చేతులు కడగాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

చోరీ కేసులో నలుగురి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న టికిరి పోలీసులు

ఒడిశా

రాయగడ: ఓ వ్యక్తిని పిస్తోలుతో బెదిరించి నగదు కాజేసిన కేసును కాశీపూర్ సమితి టికిరి పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయం వివరాలను వెల్లడించింది. వారందించిన సమాచారం మేరకు.. ఈనెల 15వ తేదీన కలప వ్యాపారం చేసే వజీర్ ఆహ్మద్ అనే వ్యక్తి కలప లోడు చేసేందు కు పహండి కూడలికి వెళ్లాడు. కొన్ని కారణాల వల్ల కలప లోడు చేయలేక వాహ నం పక్కన నిలిపి విశ్రాంతి తీసుకున్నాడు. రాత్రి 12.30 గంటల సమయంలో నలుగురు వచ్చి వజీర్‌కు కత్తులు, పిస్తోలుతో బెదిరించి అతని వద్ద నుంచి రూ.6వేలు కాజేశారు. దానితో పాటు అతని ఫోన్‌పే ఖాతా నుంచి రూ.22వేలు వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. మరునాటి ఉదయం వజీర్ ఈ విషయం టికిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 18 గ్రాముల బంగారు, ఓ కారు, ఓ మోటరు సైకిల్, ఓ పిస్తోలు, కత్తి, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

సామాన్యుడికి అర్థమయ్యేలా శ్రీశ్రీ కవితలు



ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు

రాయగడ: సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో శ్రీశ్రీ తన కలాన్ని ఝుళిపించారని ప్రముఖ రచయత, కవి, రంగస్థల నటుడు, ప్రభుత్వ ఇంజినీర్ బులుసు రవిశర్మ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక స్పందన సంస్థ కార్యాలయంలో సాహితీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'కవి సార్వభౌమ శ్రీనాథుడు, ఆధునిక విప్లవ కవి శ్రీశ్రీ రచనలు సమాజంపై వారి ముద్ర' అనే అంశంపై ప్రత్యేక కవితా గోష్ఠి నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. శ్రీనాథుడు కవితా ధోరణి అపూర్వమని కొనియాడారు. శ్రీశ్రీ సమాజం నుంచి, శ్రామిక వర్గం కష్టాలనుంచి తన సాహిత్యాన్ని విప్లవ పంథాలో నడిపారన్నారు. ప్రముఖ కవి, ఆధ్యాత్మిక ప్రవచన కారుడు భళ్లమూడి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, స్పందన కార్యదర్శి పతివాడ తులసీదాస్, స్పందన సంస్థ కీలక సభ్యుడు పల్లల శంకరరావు, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ పట్నాయక్, సాంస్కృతిక కార్యదర్శి కేకేఎం పట్నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల మినీ మారథాన్

రాయగడ: పట్టణంలోని వివిధ మహిళా సంఘాలకు చెందిన మహిళలకు సాయప్రియ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మినీ మారథాన్ పోటీలు నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ వద్ద ప్రారంభమైన పోటీ కలెక్టర్ కార్యాలయం మీదుగా సమితి కార్యాలయం వరకు అక్కడ నుంచి మళ్లీ లయన్స్ క్లబ్ వరకు సాగింది. ఈ పోటీలో పట్టణంలోని వివిధ మహిళాల సంఘాలు పాల్గొన్నాయి. పోటీలో ఎం.సుజాత, ఎం.కళ్యాణి, జి.స్వాతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



మారథాన్ పోటీలో పాల్గొన్న మహిళలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

వంగర: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జనార్దనరా వు సూచించారు. సోమవారం మద్దువలస జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ రావు, సిబ్బంది సురేష్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ● **రేగిడి:** విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఈ.శ్రీనివాస్ సూచించారు. ఉంగరాడ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సోమవారం మత్తు పదార్థాల నిరోధంపై చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ సూర్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రేగిడి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రైతులను ఆదుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రసాదరావు

పాలకొండ: రైతులు ఆర్థికంగా ఆహార ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు కోరారు. ఈమేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రైతు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ, రెవెన్యూ, జలవనరుల శాఖలు కీలకమన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసి అన్ని విధాలుగా నష్టపరిచారన్నారు. రానున్న కాలంలో మిల్లర్ల దందాలను అరికట్టాలని, ధాన్యం పంపించే విధానంలో జంబ్లింగ్ విధానం చేయాలని కోరారు.

క్లుప్తంగా..

లోకేశ్‌ను కలిసిన రంజిత్‌కుమార్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర యువగళం కోఆర్డినేటర్, కురుపాం మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్ సోమవారం మంగళగిరిలో కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు తెలిపారు.



లోకేశ్‌ను అభినందిస్తున్న రంజిత్‌కుమార్

నేడు పైడిమారమ్మతల్లి పండగ

కురుపాం: కురుపాం పైడిమారమ్మ తల్లి అమ్మవారు పండుగ మంగళవారం, బుధవారం నిర్వహించనున్నారు. పైడిమారమ్మ ఆలయ అనువంశిక నిర్వాహకుడు బూరుబు నారాయణరావు మాట్లాడుతూ మంగళవారం ఒంటి ఘటం తెచ్చి మొక్కులు తీరుస్తామని, బుధవారం అనుప పండుగ నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు సహకరించాలని ఆయన కోరారు.



పైడిమారమ్మ తల్లి

పూడిక తొలగింపు



కాలువలోని పూడికను తొలగిస్తున్న దృశ్యం

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీలో సోమవారం మురుగు కాలువల్లోని పూడకలను తొలగించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన మురుగు కాలువలను శుభ్రం చేయండి అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు సోమవారం అంబేద్కర్ జంక్షన్ నుంచి బార్నాల వీధి మురుగు కాలువలోని మురుగును తొలగించారు. దీనితో అక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల తెలిపారు. ఆరో తరగతిలో 37, ఏడో తరగతిలో ఏడు, 8వ తరగతిలో 20, తొమ్మిదో తరగతిలో పది సీట్లు ఎస్సీలకు కేటాయించామని చెప్పారు. విద్యార్థులకు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

27న వాహనాల వేలం

సాలూరు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో ఈనెల 27న డిప్యూటీ కమిషనర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆదేశాల మేరకు 17 ద్విచక్ర వాహనాలు, ఒక కారు మొత్తంగా 18 వాహనాలను వేలం వేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకట్రావ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఈఎండీ ఎమౌంట్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలో వాహనాన్ని సొంతం చేసుకున్న వ్యక్తి ఆ ధరపై 18 శాతం జీఎస్టీ అమౌంట్‌ను చెల్లించి వాహనాన్ని అదే రోజు తీసుకుని వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.